క్లుప్తంగా

వైరాలో షటిల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో బొర్రా రాజశేఖర్

వైరా: వైరాలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ పోటీలను జిల్లా కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల చిన్నారులలో మానసిక శారీరక వికాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శ్రీరామనేని భాస్కరరావు, వెంకట్రావు, ప్రసాద్, నిఖిల్, వైరా ఇండోర్ స్టేడియం కోచ్ అంజి పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలి



ఎన్టీఆర్ కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ కోరారు. ఆదివారం సీపీఎం సర్వే బృందం కాకర్లపల్లి గ్రామంలో పర్యటించి వృథాగా ఉన్న ఎన్టీఆర్ కాలువను పూడ్చి కాకర్లపల్లి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా కాకపల్లి గ్రామంలోని కాలనీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో వేపులపాటి కుమారస్వామి, సనందరావు, లక్ష్మీనారాయణ, చిట్టెమ్మ, రామకృష్ణ, చెన్నారావు పాల్గొన్నారు.

యూరియా అందించాలి



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

వైరా: యూరియా పంపిణీలో బయోమెట్రిక్ విధానం ఎత్తివేసి రైతులకు సరిపడా యూరియా అందజేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. ఆదివారం వైరాలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో రైతులకు సరిపడా యూరియా అందజేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ధికోసమే తెలంగాణ యూరియా కోటా తగ్గించిందన్నారు. రాష్ట్రంలో పంటల సాగు ఎంత విస్తీర్ణంలో జరగుతుందన్న ముందస్తు సమాచారం ఉన్నా ప్రభుత్వం ముందు చూపు లేకుండా యూరియా సరిపడా తీసుక రావడంలో విఫలం అయ్యిందన్నారు. రైతులకు సరిపడా యూరియా అందివ్వని పక్షంలో పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా బాధ్యులు గుడిమెట్ల మోహనరావు, చెరుకుమల్లి కుటుంబరావు, బాదావత్ శ్రీనివాసరావు, అజ్మీరా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెలగపూడి కుటుంబానికి మంత్రి తుమ్మల పరామర్శ..



వెలగపూడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, నాయకులు

మధిర: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తుమ్మల అనుచరుడు వెలగపూడి శివరాంప్రసాద్ కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. సిరిపురం గ్రామంలో వెలగపూడి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. మొదటి నుంచి తన రాజకీయ జీవితంలో వెలగపూడి తన వెంట నడిచిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మృతి వారి కుటుంబంతోపాటు అనుచరులకు తీరనిలోటని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు మొండితోక సుధాకర్, చెరుకూరి నాగార్జున తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి..

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో ఆదివారం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తల్లాడ మాజీ ఎంపీటీసీ వేమిరెడ్డి రామ తులశమ్మ కుటుంబాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. రామ తులశమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలకొడిమ, గంగదేవిపాడు సొసైటీ అధ్యక్షుడు నరసింహారావు, తల్లాడ మాజీ సర్పంచ్ సంధ్యారాణి, వీరభద్రరావు, నాయకులు రాయల రాము, కేవీ, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, రామప్పారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పొంచిఉన్న ముప్పు..





విద్యుత్ వైర్లతో కలిసిపోయిన కేబుళ్లు

కిందకు వేలాడుతున్న వైర్లు



తల్లాడ-గొల్లగూడెం రోడ్డు మధ్యలో కిందకు ఉన్న సర్వీస్ వైర్లు, కేబుల్ వైర్లు

విద్యుత్ స్తంభాలపై వేలాడుతున్న కేబుళ్లు

- కోతులబెడదతో తెగిపడుతున్న వైర్లు
- కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా..
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

తల్లాడ: విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకున్న నాధుడే లేడు. ఏ వీధిలో చూసినా తల్లాడలో కేబుల్ వైర్లు విద్యుత్ స్తంభాలకు వేలాడుతూ అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. గ్రామంలో విద్యుత్ స్తంభాలపై కేవలం నాలుగు వరుసలతో మాత్రమే కరెంట్ తీగలు ఉంటే.. ఆ స్తంభాలపై 20కిపైగా వరుసలతో కూడిన కేబుల్ వైర్లు వేలాడుతూ కినిపిస్తున్నాయి.

సర్వీస్ వైర్లు, కేబుల్‌వైర్లు కలిసిపోయి..

తల్లాడ గ్రామంలో పలు వీధుల్లో సర్వీస్ వైర్లు, కేబుల్ వైర్లు కలిసిపోయాయి. రెండు గృహ అవసరాలకు సంబంధించినవి కాబట్టి తీగల ద్వారా వచ్చేవి గనుక ఒక దాని మీద ఒకటి లాగటం వల్ల మెలేసుకొని ఉన్నాయి. ఈ సర్వీస్ వైర్లు, కేబుల్ వైర్లు చాలా కిందకు వేలాడుతున్నాయి. ఏదైనా వాహనాలు, లేదా వరిగడ్డి ట్రాక్టర్లు, గణపతి ఉత్సవాల సమయంలో విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ఈ వైర్లు పొరపాటున తగిలితే ఇక అంతే సంగతులు. పలు చోట్ల కేబుల్ వైర్లు రోడ్డుకు మధ్య నుంచి తీయటంతో.. తీగలు తెగి రోడ్డుపై పడిన సందర్భాలు అనేకం. అయినా రెండుమూడు రోజుల వరకు నిర్వాహకులు అలానే ఉంచుతున్నారు. తల్లాడలోని ప్రధాన రహదారి పక్కనున్న స్తంభాలకు దగ్గరదగ్గరగా ఉన్న కేబుల్, విద్యుత్ వైర్లు తాకి విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో పాదాచారులు, ప్రయాణికులు భయందోళనకు గురవుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ఇవి ప్రమాదకరంగా మారుతుండడంతో మండల కేంద్ర ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు, ప్రయాణికులు, వ్యాపారులు తరచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి దుమారానికి విద్యుత్ తీగలు తగిలినప్పుడు మెరుపులు వచ్చి అవి కేబుల్ వైర్లపై పడి మంటలు వస్తున్నాయి. ఇలాంటి ఘటనలు ఎక్కువగా ప్రధాన రహదారుల వెంట జరుగుతుండడంతో పాదాచారులతో పాటు ప్రయాణికులు కూడా భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా గొల్లగూడెం రోడ్డు, వెంకటేశ్వర టెంపుల్, చర్చి రోడ్డు, కల్యాణ మండపం రోడ్డులో ప్రమాద కరంగా వైర్లు దర్శన మిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా.. విద్యుత్ శాఖ అధికారులు కానీ, కేబుల్ నిర్వహకులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

డిప్యూటీ సీఎం ఆదేశించినా.. అంతే ఉన్నాయి

ఇటీవల హైదరాబాద్‌లో కేబుల్‌వైర్ల వల్ల జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కేబుల్ వైర్లను విద్యుత్ స్తంభాల నుంచి తొలగించాలని ఆదేశించారు. అయినా కేబుల్ నిర్వాహకులు పట్టించుకోక పోవడంతో వైర్లు విద్యుత్ స్తంభాలకు వేలాడుతూ కనిపిస్తున్నాయి. దీనికి తోడు తల్లాడలో కోతుల బెడద విపరీతంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. తల్లాడ ఏడీఈ సతీష్, ఏఈ రాయల ప్రసాద్ కేబుల్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి కేబుల్ వైర్లు కిందకు వేలాడుకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా యథాతదంగానే ఉన్నాయి.

వైర్లు సరి చేయాలని చెప్పాం..



తల్లాడ పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్లను వెంటనే సరి చేయాలని సూచించాం. ముఖ్యంగా కిందకు వేలాడుతన్న కేబుల్ వైర్లను పైకి లాగాలని, ఎత్తు పెంచాలని, తెలపడంతో పాటు బాక్సులు కూడా కొత్తవి ఏర్పాటు చేసుకోవాలని చెప్పాం. రెండు రోజుల్లోగా విద్యుత్ వైర్లు సరిచేస్తామని చెప్పారు.

– రాయల ప్రసాద్, విద్యుత్ ఏఈ, తల్లాడ

ప్రమాదకరంగా ఉన్నాయి..



విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కిందకు వేలాడుతున్నా వైర్లను పైకి లాగాలి. ట్రాక్టర్లపై ఏమైనా లోడు వేసుకొని వెళ్లాలన్నా తీగలు అడ్డువస్తున్నాయి. విద్యుత్, కేబుల్ వైర్లు కలిసిపోవడంతో ఎవైనా లోడుతో వెళ్తున్న వాహనాలకు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యుత్ శాఖ వెంటనే చర్యలు తీసుకోవాలి.

– దగ్గుల శ్రీనివాసరెడ్డి, తల్లాడ

జ్ఞాపకాలను గుర్తుచేసేది ఫొటోనే..



మొక్క అందిస్తున్న మట్టా దయానంద్

సత్తుపల్లి: జీవితంలో జరిగిన సంఘటనలకు సంబంధించిన జ్ఞాపకాలను గుర్తు చేసేది ఫొటో మాత్రమేనని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ అన్నారు. ఆదివారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఫొటో గ్రాఫర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఫొటో గ్రాఫర్లకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం మట్టా దయానంద్‌ను ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పాషా, రాంబాబు, మూర్తి, కనకరావు, రఘు, అశోక్, రమేష్, సాయి, కిషోర్, రాము పాల్గొన్నారు.

రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరికీ తెలియాలి



మాట్లాడుతున్న కొండలరావు

బోనకల్: రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరికీ తెలిస్తే కొందరికి మోదం, కొందరికి ఖేదం అని పల్లె ప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షుడు పల్లా కొండలరావు అన్నారు. ఆదివారం బోనకల్ సీపీఎం కార్యాలయంలో జరిగిన స్టడీ సర్కిల్‌లో రాజ్యాంగ అధ్యయనం ఎవరికి ప్రమాదం అనే అంశంపై ఆయన మాట్లాడారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే అభివృద్ధిని కోరుకునేవారు రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి పోరాడుతున్నారన్నారు. రాజ్యాంగంపై అవగాహన పెంచుకుని రాజ్యాంగ విలువలు కాపాడకపోతే దేశ మనుగడ ప్రమాదంలో ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యం మెరుగు పడాలంటే ఓటు విలువను ప్రచారం చేయాలన్నారు. పెట్టుబడిదారులే నేరుగా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై తే చట్టాలు దుర్వినియోగం అవడమే కాకుండా వారికి అనుకూలమైన చట్టాలు తయారు చేసుకుంటున్నారన్నారు. ప్రజలు చైతన్యవంతులై ఓటు తో ప్రజాస్వామ్యాన్ని కాపాడినప్పుడే అసమానతలు తొలిగిపోతాయన్నారు. తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ స్టడీ సర్కిల్‌లో చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, ఎరగాని కృష్ణవేణి, హరికిషన్‌రావు, అప్పాచారి, రమేష్, సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలి

కారేపల్లి: గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కారేపల్లిలో ఆ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 30వేల మంది గ్రామీణ వైద్యులు పని చేస్తున్నారని, గతంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పారా మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి, గ్రామీణ వైద్యులకు వెయ్యి గంటల శిక్షణ ఇవ్వటం జరిగిందని, శిక్షణ పొందిన గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించకపోవటం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి అనంతారపు వెంకటాచారి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు విప్లవ శిఖరం సురవరం



సురవరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ కార్యకర్తలు

కొణిజర్ల: కమ్యూనిస్టు విప్లవ శిఖరం సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అని కొణిజర్ల మండల సీపీఐ మండల కార్యదర్శి గడల భాస్కరరావు అన్నారు. ఆదివారం తనికెళ్లలో నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పలువురు నాయకులు సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థిగా ఉన్నప్పుడే సురవరం సమస్యలపై ఎలుగెత్తి పోరాడాడన్నారు. కార్యక్రమంలో నాయకులు గడల సీతారామయ్య, పీవీ రావు, పొట్లపల్లి సీతారాములు, బాస నాగరాజు, రామయ్య, వీరయ్య, సైదారావు, శంకరరావు, సత్యం, రత్తయ్య, అంజయ్య, వెంకయ్య, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ఎర్రుపాలెం: మండలంలోని సఖినవీడు గ్రామ మాజీ సర్పంచ్ సూరానేని వెంకట్రావమ్మ(70) ఆదివారం మృతి చెందారు. ఈమె గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మృతురాలి భర్త మాజీ వైస్ ఎంపీపీ రామకోటేశ్వరరావుకు ఫోన్ చేసి పరామర్శించారు. జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ తదితరులు మృతదేహనికి నివాళి అర్పించారు. సర్పంచ్‌గా గ్రామానికి ఆమె అందించిన సేవలను కొనియాడారు. పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.

డ్రగ్స్‌తో జీవితం దుర్భరం..



అవగాహన సదస్సులో పాల్గొన్న ఎస్సైలు కవిత, ప్రదీప్

సత్తుపల్లిటౌన్: డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేస్తుందని.. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని వేంసూరు, సత్తుపల్లి ఎస్సైలు కవిత, ప్రదీప్ అన్నారు. సత్తుపల్లిలో ఆదివారం యువసేవా సమితి ఆధ్వర్యాన డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. చదువుపై విద్యార్థులు దృష్టి పెట్టాలని.. ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత, విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, యువసేవాసమితి బాధ్యులు రాజు, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, తోట సుజలరాణి, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, నితిన్, వెంకట్, గాదె చెన్నారావు, చల్లగుళ్ల నర్సింహారావు, ఎండి కమల్ పాషా, నరేష్, మురళీ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని: మండలంలోని సీతంపేట గ్రామంలో లబ్ధిదారులకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన నారపోగు పుల్లారావు, జక్కుల పవన్ కల్యాణ్ లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.51 వేల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల భట్టికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి బస్వయ్య, కొండలరావు, హుస్సేన్, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, మాధవరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వీరబాబు, బాబు, వెంకటేశ్వర్లు, భిక్షమయ్య, వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టుపై ప్రభుత్వాల నిర్లక్ష్యం



కారేపల్లి: మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

కల్లూరురూరల్/కారేపల్లి: గోదావరి నదిపై నిర్మిస్తున్న శ్రీసీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం కల్లూరు మండలంలోని చెన్నూరులో నిర్వహించిన రైతు సంఘం మహాసభలో, కారేపల్లి మండలంలోని పాటిమీదిగుంపు గ్రామంలో జరిగిన రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 10 రోజులు కూడా గోదావరి జలాలు సరఫరా చేయలేకపోయారని విమర్శించారు. జిల్లాలో రెండు పంటలకు నీరు అందించాలంటే గోదావరి నదిపై బరాజ్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరారు. 2004వ సంవత్సరంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2005వ సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన దుమ్ముగూడెం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన నేటికి పూర్తి చేయలేదన్నారు. 2016వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక.. కేసీఆర్ నాయకత్వంలో ఆనాటి టీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్ పేరుతో మార్పు చేసి సీతారామ ప్రాజెక్టు కెనాల్‌ను జూలూరుపాడు మండలం చివరి వరకు పూర్తి చేసిందని, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధుల కేటాయింపు లేకపోవటంతో పనులు కొనసాగటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరుతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పత్తికి మద్దతు ధర లేక రైతులు నష్టపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో యూరియా సక్రమంగా సరఫరా చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు మహాసభ పేర్కొంది. రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వం సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా కల్లూరులోని సమావేశంలో రైతు సంఘం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సామినేని హనుమంతరావు, కార్యదర్శిగా ముదిగొండ అంజయ్యలతో పాటుగా మరో 12మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునారు. ఈ మహాసభలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్‌రావు, జిల్లా నాయకులు శ్రీరామ్ సత్యనారాయణరెడ్డి, రావుల రాజబాబు, మాదాల వెంకటేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జున్‌రావు, చింతలపూడి పురుషోత్తం, స్టాలిన్, లక్ష్మణ్‌రావు, వీరభద్రం, పుల్లయ్య , సీఐటీయూ జిల్లా నాయకులు నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి రామారావు, నాయకులు సీతారామయ్య, మాజీ సర్పంచ్ రాంబాయమ్మ, ధనమ్మ, వెంకన్న, శ్రీనివాసరావు, రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష..



శ్రీప్రసన్నాంజనేయ దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని హనుమాన్ తాండ గ్రామంలో నిర్మించతలపెట్టిన శ్రీప్రసన్నాంజనేయ దేవాలయ నిర్మాణానికి అదే తాండకు చెందిన బీఆర్ఎస్ మండల శాఖ ఉపాధ్యక్షుడు బానోత్ కృష్ణ రూ.లక్ష విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. మాజీ శాసన సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ లక్కినేని రఘు సహకారంతో తాను లక్ష రూపాయలు దేవదాయ కమిటీ నిర్వాహకులకు అందించానని బానోత్ కృష్ణ తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం లక్ష రూపాయలు వితరణ చేసిన బానోత్ కృష్ణను హనుమాతాండావాసుల అభినందించారు. శ్రీప్రసన్నాంజయేయ ఆలయ నిర్మాణానికి మరికొంత మంది ముందుకొచ్చి విరాళాలు అందించాలని ఆలయ నిర్వాహకులు ఈ సందర్భంగా కోరారు.

పంచాయతీకి శవపేటిక..



తీగలబంజరలో పంచాయతీకి శవపేటిక అందిస్తున్న జమాల్ సాహెబ్

కొణిజర్ల: మండలంలోని తీగలబంజర గ్రామ పంచాయతీ కార్యాలయానికి గ్రామానికి చెందిన షేక్ జమాల్, జాన్‌బీ దంపతులు రూ.75 వేల విలువ చేసే శవపేటికను విరతణగా అందజేశారు. గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు బంధువులు వచ్చేంతవరకు శవాన్ని భద్రపరిచేందుకు ఫ్రీజర్ శవపేటిక ఎంతగానో ఉపయోగ పడుతుందని గ్రామస్తులు జమాల్ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కట్టా రాంబాబు, మీటు, దాదా సాహెబ్, లెనిన్‌బాబు, శ్రీను, సోమశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులే.. పడక గదులు!

సమస్యలకు నిలయంగా గురుకులం

- అరకొర సౌకర్యాలతో విద్యార్థుల అవస్థలు
- నీటి కనెక్షన్ లేక టాయిలెట్లు దుర్గంధం
- గదులు సరిపోక ఆరుబయటే విద్యాబోధన
- అయినా 100 శాతం ఉత్తీర్ణత

బోనకల్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల అనేక సమస్యలతో సతమతమవుతోంది. 2010లో నాటి ఎన్నెస్పీ క్వార్టర్స్‌లో ప్రారంభమైన గురుకుల పాఠశాల మొదటి సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశాలతో ప్రారంభమై నేడు ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో తరగతి గదులు కొరత ఉండడంతో ప్రథమ, ద్వితీయ తరగతులను మధిర మండలం కృష్ణాపురంలో నిర్వహిస్తున్నారు. గురుకుల పాఠశాలలో మాత్రం 10వ తరగతి వరకు 388 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఎన్నెస్పీ పాత భవనంలో తరగతులు మొదలు కాగా ఆతర్వాత భవనం మంజూరు కావడంతో ఆరు గదులతో నిర్మాణం చేశారు. అయినా తరగతి గదులు చాలకపోవడంతో మరో మూడు గదులు మంజూరు కాగా ప్రస్తుతం 9 గదులు మాత్రమే ఉన్నాయి. సెక్షన్లు ఉండడంతో మరో 6 గదులు అవసరం ఉన్నప్పటికి ఆరు బయట చెట్లకింద విద్యాబోధన నిర్వహించాల్సి వస్తోంది.

ఆందోళనలో తల్లిదండ్రులు..

ఎన్ఎస్పీకి సంబంధించి క్వార్టర్లలో శిథిలావస్థలో ఉన్నప్పటికీ వాటిని తొలగించలేదు. దీంతో గతేడాది వాటిలోకి వెళ్లిన ఓ విద్యార్థికి క్వార్టర్ కూలి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయాన క్వార్టర్లను తొలగిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం జరగడంలేదు. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అని విద్యార్థుల తలిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నీటి కనెక్షన్ లేని మరుగుదొడ్డి

టాయిలెట్లు దుర్గంధం..


విద్యార్థులందరికీ 18 టాయిలెట్లు మాత్రమే ఉండడంతో ఉదయం క్యూ కట్టాల్సి పరిస్థితి ఉంది. దీనికి తోడు నీటివసతి సక్రమంగా లేక టాయిలెట్స్ నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. బాత్రూంలకు నీటి కనెక్షన్ లేకపోవడంతో విద్యార్థులు బకెట్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. స్నానం చేయడానికి పూర్తిస్థాయిలో వాటర్‌ట్యాంక్ లేదు. లైబ్రరీ సౌకర్యం లేదు.



బోనకల్ గురుకుల పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

ఉపాధ్యాయులకు స్టాఫ్ రూమ్ కూడా లేదు. భోజనశాల హాల్ విద్యార్థులకు తరగతి గదులు, పడకగదులుగా మారిపోయిందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పాఠశాల ఆవరణంలో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారింది. అరకొర సౌకర్యాలకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నప్పటికీ ఫలితాల్లో మాత్రం గత రెండేళ్లుగా 100శాతం ఉత్తీర్ణత సాధిస్తూ జిల్లాలోనే మొదటి స్థానంలో నిలుస్తుండడం విశేషం.

అదనపు గదులు నిర్మించాలి..



తరగతి గదుల కొరత తీవ్రంగా ఉంది. విద్యార్థులు తరగతి గదుల్లోనే పడుకోవాల్సి వస్తోంది. మరుగుదొడ్ల సమస్య, నీటి కొరత ఇబ్బందికరంగా ఉంది. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాం.

– లింగం జ్యోతిర్మయి, ప్రిన్సిపాల్